ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 26 జనవరి 2025



సరస్వతీ పుష్కారాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మే నెలలో కాళేశ్వరంలో జరిగే సరస్వతి పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. సరస్వతి పుష్కారాలపై సమీక్షించారు. పుష్కరాలకు సంబంధించిన పనులను సమర్థంగా పూర్తిచేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రణా ళికాబద్ధంగా అన్ని శాఖల అధికారు లు సమన్వయంతో పనిచేసి ఏప్రిల్ 30లోగా పూర్తి చేయాలన్నారు. పనులకు సంబంధించిన టెండర్లను పూర్తి చేయాలన్నారు. అలాగే ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో కాళేశ్వరంలో కుంభాషేకం జరగనున్న నేపథ్యంలో ఆ పనులను కూడా పూర్తి చేయాలనా కలెక్టర్ ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ఓటు హక్కు వజ్రాయుధం

ఓటు హక్కు ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, బీఎల్‌వోలకు ప్రశంసపత్రాలను అందించారు.ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలన్నా, ప్రజల గొంతుకలు వినపడాలన్నా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో రవి, డీపీవో నారాయణరావు, డీఎంహెచ్‌వో మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



చిన్ననాటి నుంచే అణగారిన వర్గాల హక్కుల సాధనపై తపన

తొలుత సామాజిక కార్యకర్తగా.. ఆ తర్వాత ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడిగా..

మాదిగ ఉద్యమ నేతకు పద్మశ్రీ

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డుకు మంద కృష్ణమాదిగ ఎంపిక



మాదిగ దండోర విశ్వరూప సభలో భావోద్వేగానికి గురైన మందకృష్ణను హత్తుకున్న ప్రధాని నరేంద్ర మోదీ (ఫైల్)

- అనేక ప్రజా పోరాటాలకు ఆద్యుడిగా నిలిచిన దళిత నాయకుడు
- దండోరా, పలు మానవీయ ఉద్యమాలతో కొత్త స్ఫూర్తి
- రాజకీయంగానూ క్రియాశీలక పాత్ర

హనుమకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఉద్యమ నాయకుడిగా, మానవీయ పోరాటాలకు ఆద్యుడిగా పేరున్న.. మాదిగల ఆత్మగౌరవం, రిజర్వేషన్ల సాధన కోసం పోరాడుతున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అత్యంత ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రజావ్యవహారాల కేటగిరీలో రాష్ట్రం నుంచి ఆయనకు ఈ పురస్కారం దక్కింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుల్లో ఏడుగురు తెలుగువారు ఎంపికవగా వారిలో మంద కృష్ణ ఒకరు. కృష్ణమాదిగ హనుమకొండ జిల్లా హంటర్ రోడ్డులోని న్యూశాయంపేటలో 1965లో జన్మించారు. తండ్రి పేరు కొమురయ్య, తల్లి కొమురమ్మ. భార్య జ్యోతి, ముగ్గురు సంతానం. ఒక కూతురు, ఇద్దరు కుమారులుండగా.. కూతురు వైద్యురాలు. కృష్ణమాదిగ బాల్యమంతా

మిగతా 7వ పేజీలో..

- రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా స్కీమ్‌లు ప్రారంభం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,717గ్రామాల్లో 3,18,338 దరఖాస్తులు
- అత్యధికంగా రేషన్‌కార్డుల కోసం 1,49,478మంది అర్జీలు
- ప్రతీ మండలం నుంచి ఒక గ్రామం చొప్పున ఎంపిక
- ఆ గ్రామంలో నూరుశాతం పథకాలు అమలుకు కార్యాచరణ
- ఫిబ్రవరి ఒకటి నుంచి మార్చి చివరినాటికి అర్హులందరికీ అందేలా చర్యలు



చార్ ధమాకా..!

నేడు నాలుగు కొత్త పథకాలకు ప్రభుత్వం శ్రీకారం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కొత్త సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. తద్వారా గణతంత్ర దినోత్సవ కానుకగా ప్రజలకు 'చార్ ధమాకా' ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేసింది. రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాల అమలుకు కార్యాచరణ రూపొందించింది. తొలుత ప్రతీ మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి.. ఆ గ్రామంలో ఈ నాలుగు పథకాలను నూరుశాతం అమలు చేసేలా కసరత్తు చేసింది. అయితే ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,717 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా.. నాలుగు పథకాల కోసం 3,18,338 మంది దరఖాస్తులు చేస్తున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి మార్చి చివరినాటికి అర్హులందరికీ కొత్త పథకాలను అందించనున్నారు. దీంతో పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలతో పాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా దక్కుతుందని భావిస్తున్న పేదల ఆశలు నెరవేరనున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

ఐదేళ్లలో ఘనమైన అభివృద్ధిని సాధించాం

మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి

భూపాలపల్లిటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో ఘనమైన పట్టణాభివృద్ధిని సాధించామని మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అన్నారు. మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిలర్లకు శనివారం వీడ్కోలు సభ కమిషనర్ రాజేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కరోనా కాలంలో పారిశుధ్య సిబ్బంది అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. వారిని పనిచేయించడంలో కౌన్సిలర్లు ఎంతో కృషి చేశారని అన్నారు. అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహకారంతో భూపాలపల్లి పట్టణంలోని అనేక అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తుచేశారు. వైస్ చైర్మన్ గండ్ర హరీశ్ రెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ జీవితానికి తండ్రి సుధార్ రెడ్డి ప్రేరణ అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఒక కౌన్సిలర్‌గా, వైస్ చైర్మన్‌గా ప్రజలకు సేవలు చేశానని తెలిపారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో తాము ఎదుర్కొన్న ఒడిదుడుకులు, విజయాలను నెమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీవో సునీల్, ఏఈ మానస, ఆర్‌ఐ భాస్కర్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి

పకడ్బందీగా పథకాలను ప్రారంభించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆమె శనివారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు నుంచి కలెక్టర్ దివాకర పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డుల జారీ పథకాలను అమలవుతున్నాయన్నారు. వీటి ప్రారంభోత్సవాలను ప్రతి మండలం, గ్రామంలోనూ వైభవంగా నిర్వహించాలన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు నాలుగు పథకాలను అధికారికంగా ప్రారంభించాలన్నారు. ప్రతి పథకంలో అర్హులు మాత్రమే ఉండేలా పారదర్శకంగా జాబితాను రూపొందించాలని ఆదేశించారు. కొత్త రేషన్‌కార్డుల జాబితాను తహసీల్దార్లు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ఎంపీ డీవోలు, రైతు భరోసాను ఏఈవోలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాను ఏపీవోలు పరిశీలించి అర్హులకు మాత్ర మే అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామసభల్లో స్వీకరించిన నూతన దరఖాస్తులను సైతం పరిశీలించి అర్హులు ఉంటే జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, భూపాలపల్లి, ములుగు అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మహేందర్‌జీ, సంపత్‌రావు, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ పాల్గొన్నారు.



భూపాలపల్లిలోగణతంత్ర వేడుకలకు ముస్తాబు అయిన ప్రధాన వేదిక



వీక్షకుల కోసం ఏర్పాటుచేసిన షామియానాలు

రిపబ్లిక్‌డేకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ముస్తాబైన ప్రభుత్వ కార్యాలయాలు
- భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో ప్రధాన వేడుక

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా సిద్ధమైంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. ప్రధాన వేడుక భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియంలో జరగనుంది. దీంతో అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. వేడుకకు వచ్చే ప్రజలకు కూర్చునేలా స్టేడియంలో షామియానాలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు వేడుకల వీక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా తాగునీటిని అందుబాటులో ఉంచనున్నారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా సన్మానించనున్నారు. వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రశంసాపత్రాలను అందించనున్నారు.

వేడుకలు ఇలా..

- ఉదయం 9 గంటలకు - అంబేద్కర్ స్టేడియంలో జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరిస్తారు
- 9.05 గంటలకు పోలీసులు కవాతు
- 9.10 గంటలకు - పోలీసుల గౌరవ వందన స్వీకరణ
- 9.20 గంటలకు - కలెక్టర్ ప్రసంగం
- 9.30 గంటలకు - పోలీసుల గౌరవ వందనం ముగింపు
- 9.35 గంటలకు - స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం
- 9.45 గంటలకు - సంస్కృతిక కార్యక్రమాలు.
- 10.15 గంటలకు - ప్రభుత్వ శకటాల ప్రదర్శన
- 10.30 గంటలకు - ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం
- 11.20 గంటలకు - ప్రభుత్వ శాఖల స్టాల్స్ సందర్శన
- 11.30 గంటలకు - వేడుకలు ముగింపు

నిరుద్యోగులకు 'టాస్క్' గొప్పవరం

రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క



3కే రన్‌లో పాల్గొన్న మంత్రి సీతక్క, అధికారులు

ములుగు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందేందుకు వారిలో ప్రతిభ పాటవాలు మెరుగుపర్చేందుకు జిల్లాలో టాస్క్ శిక్షణ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్పవరమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్‌ను ఆమె కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల మారుమూల ప్రాంతాల్లోని యువతీ యువకులకు ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. ప్రతిభ పరిజ్ఞానం లేకపోతే ఉన్నత చదువులు చదివినా లాభం ఉండదని అన్నారు. శిక్షణ పొందే క్రమంలో కొంత కష్టంగా ఉన్నప్పటికీ శిక్షణ పొందినవారు ఉద్యోగ అవకాశాలు పొందుతారని, కష్టపడి చదివిన వారికే విజయం దరి చేరుతుందని అన్నారు. నేటి కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం అనేది మామూలుగా మారిపోయిందని, ఐటీరంగం పోయి ఆర్టిఫిషియల్ ఇంటిలెన్స్ యుగం వచ్చిందని అన్నారు. ప్రతి ఒక్కరికి కమ్యూనికేషన్ స్కిల్ కచ్చితంగా ఉండాలని, ఎలాంటి అవకాశాలు వచ్చినా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతీ యువకులు తల్లిదండ్రులకు భారం కాకుండా ఒక లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ ఒక కుటుంబం బాగుపడాలంటే ఒకరికి ఉద్యోగం ఉండాలని, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగమైనా వచ్చిన అవకాశాన్ని వదలవద్దని సూచించారు. ఇటీవల జిల్లాలో నిర్వహించిన మెగా



టాస్క్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మిగతా 8వ పేజీలో...

దామోదర్ క్షేమంగానే ఉన్నాడు

మావోయిస్టు పార్టీ సౌత్ జోనల్ ప్రతినిధి సోమతేర్ సమత

ఏటూరునాగారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు తెలం గాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ క్షేమంగానే ఉన్నాడని ఆ పార్టీ ప్రకటించింది. మావోయిస్టు సౌత్ జోన ల్ ప్రతినిధి సోమతేర్ అలియాస్ సమత పేరుతో మీడియాకు ఈ మేరకు శనివారం సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. 2025 జనవరి 16, 17 తేదీల్లో 8 వేల మంది పోలీసు బలగాలతో బీజాపూర్ జిల్లా లోని సింగవరం, తుండెపల్లి, మల్లంపెంట, పూజారి కంకేర్, తేమ ల్పట్టి గ్రామాల ప్రజలపై పిరికిపంద దాడులు జరిగాయని పేర్కొ న్నారు. ఈ దాడుల్లో 8 మంది మావోయిస్టులు అమరులయ్యారని తెలిపారు. అమరులైన మావోయిస్టులకు పార్టీ నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అమరులైన వారి ఆశయాలను సాధించుకుంటామని తెలిపారు. ప్రజల్లో అయోమయం, నైరాశ్యం సృష్టించేందుకే పోలీసు లు తమ పార్టీ పేరుతో నకిలీ స్టేట్‌మెంట్లు ఇచ్చారని విమర్శించారు. మావోయిస్టు తెలంగాణ కార్యదర్శి దామోదార్‌తో పాటు ఇతర సహచరులు క్షేమంగానే ఉన్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ పేరుతో నకిలీ లేఖలను సృష్టించే వారిని గుర్తించి, స్వతంత్ర విచారణ జరిపి ద్రోహులను కఠినంగా శిక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివాసీ నేతలు, జర్నలిస్టులు, మేధావులు, ప్రతిపక్ష పార్టీలు ఈ మారణకాండపై విచారణ జరిపి వెంటనే నిజానిజాలను నిగ్గుతేల్చా లని నంబర్ వన్ ద్రోహి, తీవ్రవాద, కార్పొరేట్ భక్త ఫాసిస్ట్ బీజేపీని పూర్తిగా పాతర పెడతామని పేర్కొన్నారు. కార్పొరేటీకరణ- సైనికీక రణ కగార్ పోరుకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోరాడి అసు వులు బాసిన అమరుల త్యాగాలు వృథా కావని, పోలీసుల నెత్తుటి బాకీ తీర్చుకుంటామని హెచ్చరించారు.

ఆలయాన్ని ఎండోమెంట్‌లో చేర్చడం సరికాదు

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్

భూపాలపల్లిటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని వెంకటేశ్వర ఆలయాన్ని అడ్డదారిలో ఎండోమెంట్‌లో చేర్చడం సరికా దని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దేవరావు, బజరంగ్‌దళ్ జిల్లా నాయకుడు శ్యామ్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక దేవాలయాల్లో సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా వెంకటేశ్వర దేవాలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకోవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. కాళే శ్వరంలోని ఆలయం గర్భగుడిలో షూటింగ్ చేస్తే చర్యలు తీసుకో కుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆలయాలపై రాజకీయాలు మానుకుని వాటి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు.

టాబ్లెట్లు వేసుకుని ఒకరి ఆత్మహత్య



వెంకటేశ్వర్లు (ఫైల్)

వెంకటాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టాబ్లెట్లు వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వాడగూడెం లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడగూడెం గ్రామానికి చెందిన గుండా రఘు వెంకటేశ్వర్లు (46) కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. భార్య అంజలి సైతం అనారోగ్య సమ స్యలతో బాధపడుతోంది. ఈనెల 23న వెంకటాపురం మండల కేంద్రంలోని తన కూతురు ఇంటికి వెళ్లొస్తానని చెప్పి వెంకటేశ్వర్లు బయటకు వెళ్లాడు. జీవితంపై విరక్తి కలిగి బెస్తగూడెం గ్రామశి వారులోని రోడ్డుపక్కన గల అటవీప్రాంతంలో టాబ్లెట్లు వేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు.

మినీ మేడారం జాతరను రద్దు చేయాలి

- ఆదివాసీ ఇలవేల్పుల పండుగలకు నిధులు కేటాయించాలి
- మంత్రి సీతక్కను కోరిన చంద వంశీయులు



మంత్రి సీతక్కకు వినతిపత్రం సమర్పిస్తున్న చంద వంశస్తులు

ములుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మినీ మేడారం జాతర పేరుతో కోయ, ఆదివాసీ ఇలవేల్పుల ప్రాముఖ్యతను దెబ్బతీయొద్దని చంద వంశీయులు కోరుతున్నారు. ఇలవేల్పుల ప్రాచుర్యాన్ని తగ్గిస్తూ సంస్కృతీ సంప్రదాయాలకు విఘాతం కలిగిస్తున్న మినీ జాతరను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. శనివారం చంద వంశీయులు, కోయ పెద్దలు చంద లింగయ్య దొర, చంద వీరయ్య, అన్నవరం హనుమంతరావు, చంద మహేష్, అన్నవరం హనుమంతరావులు రాష్ట్ర మంత్రి సీతక్కను ములుగులోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రెండేళ్లకోసారి మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతరను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని, ఆసియాలోనే అతిపెద్ద జాతరగా ప్రాచుర్యం పొందడం హర్షణీయమన్నారు.

ప్రతీ ఏడాది వచ్చే మాఘ పున్నమికి కోయ గిరిజనులు తమ గొట్టు, గోత్రాల వారీగా ఇలవేల్పులను కొలుచుకుంటూ గూడాలలో పండుగలు చేసుకుంటారని తెలిపారు. వ్యాపారం, లాభాపేక్ష ఉద్దేశంతో గత మూడు పర్యాయాలుగా మేడారంలో మినీ జాతర నిర్వహిస్తుండటంతో తమ ఇలవేల్పుల ప్రాముఖ్యత, ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రాముఖ్యత తగ్గుతోందని పేర్కొన్నారు. మినీ జాతర నిర్వహణను వెంటనే రద్దు చేసి గొట్టు, గోత్రాల వారీగా జరిగే జాతరలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధిపర్చాలని కోరారు.

ప్రజల కోసం ప్రాణత్యాగం చేసింది కమ్యూనిస్టులే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



మానుకోటలో సెప్టెంబరు-17 స్ఫూర్తి చిహ్నం ఆవిష్కరణలో సాంబశివరావు, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం.. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడి ప్రాణత్యాగాలు చేసింది.. కమ్యూనిస్టులేనని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మహబూబాబాద్ మూడుకొట్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన తొలి ఎమ్మెల్యే తీగల సత్యనారాయణరావు విగ్రహాన్ని, వీర తెలంగాణ సాయుధ పోరాట సెప్టెంబరు-17 స్ఫూర్తి చిహ్నాంను శనివారం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అధ్యక్షతన సీపీఐ శతాబ్ది ఉత్సవసభను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాబోయే రోజులన్నీ కమ్యూనిస్టులేవనని ప్రపంచ దేశాల్లో నేపాల్, ఉత్తర కొరియా, చైనా లాంటి దేశాల్లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉందని చెప్పారు. ప్రశ్నించే వారే కమ్యూనిస్టులని ఎర్ర జెండాను చూస్తే ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు వణుకుపుడుతుందన్నారు. 2026 మార్చి వరకు దేశంలో నక్సలైట్లను ఉంచమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెబుతున్నారని, చనిపోతున్న వారెవరు మన తమ్ముల్లే కదా! వారు సీపీఐ నుంచి విడిపోయిన వారేనని చెప్పారు. పేదల కోసం పోరాడే వాళ్లు అడవులు, జైల్లో ఉంటూంటే దోపిడీదారులు చట్టసభల్లోకి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరు

సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు వెంకట్‌రెడ్డి

1925లో కమ్యూనిస్టు పార్టీ పుట్టిందని, నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు కొనసాగించినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ మార్పుకోరే వారు కమ్యూనిస్టులని, గత ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను కూకటి వేళ్లతో పేకిలించినట్లు చెప్పారు. మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడిన తీగల సత్యనారాయణరావు ఆశయాలను కొనసాగించాలని సూచించారు. మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ తొలి ఎమ్మెల్యే తీగల సత్యనారాయణరావు స్ఫూర్తిదాయకమని చెప్పారు.

తొలుత ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ నుంచి మూడు కొట్లసెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎర్ర జెండాలు, రెడ్ షర్టులతో పార్టీ శ్రేణులు ర్యాలీలో పాల్గొనడంతో మానుకోట పట్టణం ఎరుపెక్కింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, తొలి ఎమ్మెల్యే తీగల సత్యనారాయణరావు కుటుంబసభ్యులు విజయ, రేణుక, అరుణ, కమలాకర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, తమ్మెర విశ్వేశ్వరరావు, సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్, బి.అజయ్‌సారథి రెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నీరజారెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, చిదిరాల జ్ఞానేశ్వర్, నెల్లూరి నాగేశ్వర్‌రావు, మేక వీరన్న, కేతరాజు ఉప్పలయ్య, పాండు రంగాచారి, నక్క నాగార్జున, బిక్షపతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సెల్‌ఫోన్ తెచ్చిన తగాదాతో ఆత్మహత్య



వెన్నెల (ఫైల్)

ఇనుగుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహ బూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం రాముతండా శివారు రూప్లాతండాకు చెందిన నూనావత్ వెన్నెల (25) గడ్డినివారణ మందుతాగి, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి వరంగల్ ఎంజీఎంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఈనెల 2న వెన్నెల కుమారుడు సెల్‌ఫోన్‌లో ఆటలాడుతూ కిందపడేయడంతో పాడై పోయింది. దీంతో తన కుమారుడిని కొట్టడంతో విషయం తెలిసిన ఆమె భర్త వెన్నెలను కొట్టాడు. క్షణికావేశంతో అదేరోజున గడ్డిమందు తాగింది. ఆమెను వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి పద్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బోర్లకు అనుమతి ఇవ్వాలని రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

గోవిందరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ భూముల్లో బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రైతులు నిరసనకు దిగారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా ఫారెస్టు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతుసంఘం రాష్ట్ర నాయకుడు తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ 60 సంవత్సరాల నుంచి రైతులు రెవెన్యూ భూముల్లో కాస్తుకబ్జాలో ఉన్నారని, సర్వేనంబర్ 175లో 2,200 ఎకరాలు, రెవెన్యూభూమి సర్వేనంబర్ 95లో 30ఎకరాలు, సర్వేనంబర్ 41లో 183 ఎకరాలు ఉన్నాయని అన్నారు. ఈ భూముల్లో ఏజో విడత భూ పంపిణీలో ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చిందని, అంతేకాకుండా సర్వే నంబర్ 175లో అప్పటి సీఎం కేసీఆర్ ధరణి పట్టాలు ఇచ్చారని అన్నారు. ఆభూముల్లో రైతులు బోర్లు వేసుకునేందుకు ప్రయత్నిస్తుంటే పస్రా ఫారెస్టు ఎఫ్‌ఆర్‌వో బోర్లు వేయకుండా అడ్డం తిరిగి రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. వెంటనే రైతులు బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని, లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు మారపోయిన సారయ్య, పుప్పాల రాజన్న, గజ్జి ఎలేందర్, లకావత్ రాంచందర్, అంబాల మురళి, అన్నమయ్య, సల్లూరి రామకృష్ణ, బుర్రి వీరయ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో శాశ్వత వైద్యశాలను ఏర్పాటు చేయాలి

మంత్రి సీతక్కకు డీఎంహెచ్‌వో విజ్ఞప్తి

ములుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మేడారంలో శాశ్వత ప్రాతిపదికన 30పడకల సామాజిక వైద్యశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు కోరారు. క్యాంపు కార్యాలయంలో మం త్రిని శనివారం కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. జాతరతో సంబంధం లేకుండా నిరంతరం భక్తులు తరలివస్తుండటంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫిబ్రవరిలో జరిగే చిన్న జాతర కోసం మెడికల్ క్యాంపుల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మౌలిక సౌకర్యాల కల్పన, మందులకు నిధులు సమకూర్చాలని కోరారు.

ములుగు ఏరియా వైద్యశాలలో ఎంఆర్‌ఐ స్కాన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా మల్లంపల్లిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు సహకారమందించాలని విన్నవించారు. ఆయన వెంట టీబీ నియంత్రణాధికారి డాక్టర్ చంద్రకాంత్ ఉన్నారు.

సీతక్కను సన్మానించిన జేఏసీ నాయకులు

మంత్రి సీతక్కను శనివారం ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ సంఘాల జేఏసీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు లేని పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటుకు ఆన్‌లైన్ గ్రీవెన్స్‌కు శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ నాగేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బర్మావత్ శ్రీనివాస్, వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మేడారం చిన్న జాతర ప్రణాళికను మంత్రి సీతక్కకు వివరిస్తున్న డీఎంహెచ్‌వో

రేపటి నుంచి మిర్చి కొనుగోళ్లు షురూ

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ఈనెల 27 నుంచి మిర్చి కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు చైర్మన్ గంట సంజీవరెడ్డి తెలిపారు. మిర్చి సీజన్ ప్రారంభమైనందున శనివారం మార్కెట్లో రైతు సంఘాల ప్రతినిధులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. రైతులు తమ మిర్చి పంట ఉత్పత్తిని కేసముద్రం మార్కెట్లో విక్రయించాలని కోరారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు

- రూ.34లక్షల 84 వేల అసలు కరెన్సీ, రూ.21 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



మీడియాతో వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అసలు నోట్లు ఇస్తే.. నాలుగింతలు నకిలీ నోట్లు ఇస్తామని నకిలీ నోట్ల వ్యాపారం చేస్తున్న 8 మంది ముఠా సభ్యులను కేయూ పోలీసులు అరెస్టు చేసి రూ.34లక్షల 84 వేల అసలు కరెన్సీతో పాటు రూ.21 లక్షల నకిలీ నోట్లు, కారు, ఆటో, 9సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు మణికాల కృష్ణ గొర్రెల వ్యాపారం నిర్వహించేవాడు. వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించేందుకు ప్రణాళిక రూపొందించాడు. ఈ క్రమంలోనే తనకు అడవిలో డబ్బులతో ఉన్న డ్రమ్ము దొరికిందని, అందులోని డబ్బులు వినియోగిస్తే తనకు మంచి జరగదని, తనకు ఎవరైనా రూ.లక్ష ఇస్తే వారికి డ్రమ్ములోని రెండింతలు డబ్బులు ఇస్తానని, ఒక లక్ష ఇస్తే నాలుగు రెట్లు నకిలీనోట్లు ఇస్తానని నమ్మించేవాడు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా కేశవాపూర్‌కు చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్‌కు పాల్వంచ అడవిలో అసలు, నకిలీ నోట్లతో భద్రపరిచిన డ్రమ్మును చూపించి అందులో నుంచి అసలు రూ.500 నోటు తీసి చూపించడంతో నమ్మాడు. ఆపై రూ.10లక్షల అసలు నోట్లకుగానూ ఇరవై లక్షలు, అలాగే రూ.ఐదు లక్షల అసలు నోట్లకు రూ.20 లక్షల నకిలీ నోట్లు మార్పిడీ చేసుకునేందుకు ఇద్దరి మధ్య అంగీకారం కుదుర్చుకున్నారు. డబ్బును హనుమకొండకు తీసుకొచ్చి ఇస్తేనే తీసుకుంటానని శ్రీనివాస్ చెప్పడంతో ప్రధాన నిందితుడు అంగీకరించాడు.

ఈ క్రమంలో శుక్రవారం మణికాల కృష్ణ కారులో డబ్బు తీసుకొని వచ్చి ఓఆర్ఆర్ రోడ్డులోని పెగడపల్లి క్రాస్ వద్ద శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులకు డబ్బులు అందిస్తుడటంతో పెట్రోలింగ్ పోలీసులు ఆదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రధాన నిందితుడితో కారులో వచ్చిన కర్నూలుకు చెందిన బిజిని వేముల వెంకటయ్య, బూర్గంపాడు మండలం నక్రీపేట తండాకు చెందిన ధరంసోతు శ్రీను, తేజావత్ శివ, ముకమామిడికి చెందిన గుగులోతు వీరన్న, కేశవపూర్‌కు చెందిన ఉడుత మల్లేశ్, ఎర్రగొల్ల అజయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ప్రధాన నిందితుడు కృష్ణ గతంలో ఇదే తరహాలో నకిలీ నోట్లను విక్రయించడంతో సత్తుపల్లి, వి.యం. బంజర, లక్ష్మీదేవిపేట పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సీపీ అంబర్ కిషోర్‌ఝా నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ రవికుమార్, ఎస్సై మాధవ్, హెడ్‌కానిస్టేబుల్ నర్సింగ్‌రావు, కానిస్టేబుళ్లు శ్యాంరాజు, సంజీవ్, సంపత్, హోంగార్డు రాజేందర్ పాల్గొన్నారు.

పాకాలను సందర్శించిన పీసీసీఎఫ్ డోబ్రియాల్



పాకాలలో చేపట్టిన అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ డోబ్రియాల్

ఖానాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సును శనివారం తెలంగాణ అటవీ శాఖ ప్రధాన కార్యాలయ అధికారి (పీసీసీఎఫ్) డోబ్రియాల్ సందర్శించారు. ఈ సందర్భంగా పాకాలలో ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాకాల బయోడైవర్సిటీ పార్క్, బోటింగ్ పాయింట్, పాకాల తూములను, అటవీ ప్రాంతాన్ని సందర్శించారు.

సరస్సులో బోటు షికారు చేశారు. పాకాలలో పర్యాటక పరంగా చేపట్టిన అభివృద్ధి పనులు, అడవులు, వన్యప్రా ణుల సంరక్షణ తదితర విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకాలను సందర్శించే పర్యాటకులకు ట్రెక్కింగ్ సౌకర్యం కల్పించాలని, జంగిల్ సఫారీ, పాకాల నుంచి భీమునిపా దం వాటర్ ఫాల్స్ మీదుగా పులిమడుగు తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా పాకాలను అభివృద్ధి చేయాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ప్రకృతికి హానిచేయకుండా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ భీమానాయక్, వరంగల్, మహబూబాబాద్ డీఎఫ్‌వోలు అనూజ్ అగ్రవాల్, విశాల్, ఎఫ్‌ఆర్వో రవికిరణ్, డీఆర్వో రీణా, సిబ్బంది పాల్గొన్నారు.



వడ్డేపల్లి చెరువు వద్ద రైల్వే వంతెన పైనుంచి పొగమంచులో వెళ్తున్న రైలు

పొగ మంచు అందాలు

శీతాకాలం తెల్లవారుజామున.. మంచుకురిసే వేళ.. ప్రకృతి అందాలు రెట్టింపవుతాయి. ఓ వైపు కమ్మిన పొగమంచు.. మరోవైపు పూవులను, సాలెగూళ్లను పట్టిన మంచు బిందువులు కనుల విందు చేస్తుంటాయి. శనివారం తెల్లవారు జామున వడ్డేపల్లి చెరువు సమీపంలో ఇదిగో ఇలా ప్రకృతి రమణీయ దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

ఫోటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటో గ్రాఫర్, హనుమకొండ





నీటి బిందువులతో సాలె గూడు

ప్రజలను మోసగిస్తున్న రేవంత్ సర్కార్

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే గ్రామ సభలు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, వినయ్‌భాస్కర్, నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో గ్రామసభలలో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన అని, పేదలకు సంక్షేమ పథకాలు అని మాయమాటలు చెప్పి.. కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరాచక, పోలీస్ పాలన చేస్తున్నాడన్నారు. గ్రామసభలలో రైతులు రుణమాఫీ కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని విమర్శించారు. దావోస్, సింగపూర్ పోయి సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష కోట్లు తీసుకువస్తున్నట్లు చెబుతున్నారని, ఒక్క రూపాయి కూడా తేలేదని విమర్శించారు. రాష్ట్రంలో పోలీసులను పార్టీ కార్యకర్తలుగా వాడుకుంటున్నారని, వారితో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని ఎర్రబెల్లి ఆరోపించారు. రాష్ట్రంలో మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పోలీసు అధికారులు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. తప్పుడు కేసులు పెట్టిన పోలీసులను వదిలిపెట్టమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోసమే గ్రామసభల పేరుతో హడావుడి చేస్తోందని, అధికారులు వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రజాపాలన గ్రామ సభలలో ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీశారని, ఎక్కడ కూడా గ్రామసభలు విజయవంతం కాలేదని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఇప్పటివరకు 409మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ ఆత్మహత్యలకు సీఎం రేవంత్‌రెడ్డే కారణమన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియ శ్రీహరి ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొనకుండా క్రికెట్ పోటీలలో పాల్గొంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 40శాతానికి మించి రుణమాఫీ కాలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వందల మంది పోలీసులతో గ్రామ సభలు నిర్వహించారని విమర్శించారు. గ్రామసభలో ఒక్క లబ్ధిదారుడిని ఎంపిక చేయలేదన్నారు. నర్సంపేటలో పోలీస్‌స్టేషన్ ఎదుట మాజీ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ అనుచరులు దాడి చేస్తే పోలీసులు బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు.

ఎమ్మెల్యేలకు 2ప్లస్ 2 ఏకే 47 తుపాకులు ఎందుకు ఇచ్చారని, ప్రజాక్షేత్రంలో ఏకే47లతో తిరుగుతూ ప్రజ లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్నారు. రాజకీ య ఒత్తిడితోనే కేసులు పెడుతున్నారని, సీపీ అంబర్ కిషోర్‌ఝా కేసులపై సమీక్ష చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామసభల పేరిట, దరఖాస్తులు, సర్వేలతో ప్రభుత్వం కాలయాపన చేస్తోం దన్నారు. సంక్షేమ పథకాలు అడిగితే దాడులు చేస్తారా? అని ప్రభుత్వాన్ని విమర్శించారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎవ్వరిని తరిమికొడతారో చూద్దామని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ గుమస్తాలను పెట్టుకొని పాలన చేస్తు న్నారన్నారు. నగరంలో అభివృద్ధి ఆగి పోయిందని, గతంలో తీసుకువచ్చిన అభివృద్ధి కార్యక్రమాలకే కొబ్బరికాయలు కొట్టి కొండా సురేఖ ప్రజాపాలన అని చెప్పుకుంటున్నారన్నారు. కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, రాష్ట్ర రైతు రుణవిమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యమ నేతకు పద్మశ్రీ

(5వ పేజీ తరువాయి)

వరంగల్‌లోనే గడిచింది. ప్రాథమిక విద్య న్యూశాయంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో సాగగా, పదోతరగతి, ఇంటర్ హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాలలో చేశారు.

అణగారిన వర్గాల కోసం..

మంద కృష్ణమాదిగ మొదట పీపుల్స్‌వార్ పార్టీ సానుభూతి పరుడిగా పని చేశారు. చిన్నతనం నుంచే అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే తత్వం ఉన్న ఆయన పీపుల్స్‌వార్‌లో చేరి కొంత కాలం సీవోగా పని చేసి అరెస్టయ్యారు. నక్సల్స్ సానుభూతి పరుడైనప్పటికీ ఆయన ఆ తర్వాత కాలంలో చట్టపరమైన మార్గాల ద్వారా అట్టడుగు దళిత వర్గాల హక్కులను సాధించేందుకు తీవ్రవాదాన్ని విడిచిపెట్టారు. తర్వాత చదువుకు స్వస్తి చెప్పి పూర్తిగా సామాజిక కార్యకర్తగా పలు ప్రజా ఉద్యమాల్లో మరింత చురుకుగా పాల్గొనడం ప్రారంభించారు. రిజర్వేషన్ల అమలులో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలుగా ఉద్యమిస్తున్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావం:

1994 జులై 7న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో మాదిగ దండోరా నినాదంతో కృష్ణమాదిగ నేతృత్వంలో మొదట 20 మంది యువకులతో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భవించింది. ఎస్సీ రిజర్వేషన్లను ఎస్సీ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం విభజించి దళితుల్లో అత్యధికంగా వెనుకబడి కులాలకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో దండోర ఉద్యమం కృష్ణమాదిగ నాయకత్వంలో ముందుకు సాగింది. అణగారిన కులాల ఆత్మగౌరవం, సమన్యాయం డిమాండ్‌తో బయలుదేరిన దండోరా ఉద్యమం అనతి కాలంలోనే నాటి ఉమ్మడి రాష్ట్రంలో బలమైన ఉద్యమ సంస్థగా ఎదిగి.. అణగారిన కులాల గొంతుకగా నిలిచింది. దండోరా ఉద్యమం ఇచ్చిన స్ఫూర్తితో రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లో సైతం ఎస్సీ వర్గీకరణ ఉద్యమాలు బయలు దేరాయి. రాష్ట్రాల ఎల్లలు దాటిన ఈ ఉద్యమం దేశంలోనే దళిత హక్కులపై దేశవ్యాప్తంగా సరికొత్త చర్చకు దారి తీసింది. ఆత్మన్యూనతా భావంతో బాధపడుతున్న మాదిగలు చివరకు పేరు చివరన మాదిగ అని జోడించుకునే స్థాయికి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపిన ఘనత మందకృష్ణకే దక్కుతుంది. విస్తృత దళిత ఉద్యమంలో భాగంగా మంద కృష్ణ 1985లో కారంచేడు, 1991లో సుందూరుల్లో జరిగిన మారణ కాండలపై గళమెత్తారు.


ఇటీవల హనుమకొండలో వేయి గొంతులు.. లక్ష డప్పుల సన్నాహక కార్యక్రమంలో డప్పు కొడుతున్న మంద కృష్ణ (ఫైల్)

మానవీయ ఉద్యమాలకూ..

మంద కృష్ణమాదిగ తనదైన పద్ధతిలో ఓ వైపు మాదిగ హక్కుల కోసం ఉద్యమిస్తూనే మరో వైపు పలు మానవీయ ఉద్యమాలను సైతం చేపట్టారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం హయాంలో గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత వైద్యం అందచేయాలనే ఉద్యమానికి కూడా దండోరా ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. చాలా కాలంగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన వికలాంగుల పక్షాన కూడా మంద కృష్ణ నిలబడ్డారు. వీరికి సరైన న్యాయం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నడిపారు. మంద కృష్ణ పోరాట ఫలితంగానే తెలుగు రాష్ట్రాల్లోని వికలాంగులకు ప్రస్తుతం పింఛన్ అందుతోంది. వృద్ధులు, వితంతువుల పక్షాన కూడా ఆయన పలు పోరాటాలు చేశారు.

రాజకీయాల్లో క్రియాశీలకంగా..

మంద కృష్ణ మాదిగ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని వివిధ రూపాల్లో విస్తరిస్తూనే రాజకీయాల్లో సైతం క్రియాశీలకంగా వ్యవహరించారు. 2004 ఎన్నికల్లో ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా, 2009లో మరో సారి అదే నియోజకవర్గం నుంచి త్రిలింగ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో తన సొంత పార్టీ అయిన మహాజన సోషలిస్టు పార్టీ పక్షాన వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పటికీ గెలుపు సాధించలేకపోయారు.

ప్రధాని మోదీకి సన్నిహితంగా..

దండోరా ఉద్యమ నేపథ్యంగానే మంద కృష్ణ మాదిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సన్నిహితుడయ్యాడు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మాదిగ దండోర విశ్వరూప సభకు స్వయంగా హాజరైన నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి తన మద్దతు ప్రకటించారు. ఇటీవల లోకసభ ఎన్నికల సందర్భంగా హనుమకొండలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభల్లో నరేంద్ర మోదీ, కృష్ణమాదిగ వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని మోదీ ప్రకటించారు. ఆ సమయంలో భావోద్వేగానికి గురైన కృష్ణమాదిగ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో ఆయన్ను మోదీ హత్తుకుని ఊరడించిన సన్నివేశం నేటికీ అందరి కళ్లలో మెదులుతూనే ఉంది. ఇక 30 ఏళ్ల పాటు ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ సాగించిన పోరాటం చివరకు ఫలించే దశకు చేరుకుంది. గతేడాది ఆగస్టు 1 సుప్రీం కోర్టు కూడా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కానీ అమల్లో ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయంటూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 'వేల గొంతుకలు.. లక్ష డప్పులు' కార్యక్రమం ద్వారా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

మందకృష్ణమాదిగ గురించి..



తల్లిదండ్రులు	: కొమురమ్మ, కొమురయ్య
భార్య	: జ్యోతి
సంతానం	: ఒక కూతురు, ఇద్దరు కుమారులు
జననం	: 1965
స్వస్థలం	: హనుమకొండ హంటర్ రోడ్డులోని న్యూశాయంపేట
విద్యాభ్యాసం	: న్యూశాయంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాలల్లో పదోతరగతి, ఇంటర్ చదివారు.

రానున్న రోజుల్లో బీఆర్ఎస్ భూస్థాపితం ఖాయం

- పదేళ్లలో ఆ నాయకులు ఒక్క హామీ నెరవేర్చలేదు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి


హనుమకొండ డీసీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ సుధారాణి, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయిందన్న బాధ నుంచి ఇంకా బీఆర్ఎస్ నాయకులు కోలుకోలేదని, ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్న ఆ నాయకులు రానున్న రోజుల్లో భూస్థాపితమవడం ఖాయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ముందుగా బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ వరంగల్ పర్యటనకు వచ్చినప్పుడు వరంగల్ నగరానికి రూ.300కోట్లు ఇస్తానన్న నిధులు, కేటీఆర్ వరంగల్‌కు వచ్చి ఇచ్చిన హామీలను స్క్రీన్ ద్వారా విలేకరుల చూపించారు.

అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో ఒక్క వాగ్దానం నెరవేర్చని నాయకులు ఇప్పుడు వరంగల్ అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేస్తామని చెప్పిన నేతలు.. ఇప్పుడు ఎక్కడపోయారన్నారు. పారదర్శకంగా పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనే ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా సర్వేలు చేపట్టి అమలు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రేషన్ కార్డుల ప్రక్రియ, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు.. రెండు పడకల ఇళ్లను ఎందుకు అందించలేకపోయారని ప్రశ్నించారు. ఆ పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో.. ఎంతమందికి రేషన్‌కార్డులు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని అంటున్నారని, బీఆర్ఎస్‌కు లోకసభ ఎన్నికల్లో ప్రజలు 3వ స్థానం కల్పించి ఎప్పుడో బుద్ధిచెప్పారని ఎద్దేవా చేశారు. రానున్న ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కడతారని నాయిని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చార్ ధమాకా..!

- నేడు నాలుగు కొత్త పథకాలకు ప్రభుత్వం శ్రీకారం
- రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా స్కీమ్‌లు ప్రారంభం
- ఫిబ్రవరి ఒకటి నుంచి మార్చి చివరి నాటికి అర్హులందరికీ అందేలా చర్యలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు ఇప్పటికే పలు హామీలను నెరవేరుస్తూ వస్తున్న ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కొత్తగా నాలుగు పథకాలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ప్రతీ గ్రామంలో గ్రామ సభలను నిర్వహించింది. రేషన్‌కార్డులతో పాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు శ్రీకారం చుట్టనుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,717 గ్రామాల నుంచి 3,18,338 దరఖాస్తులను స్వీకరించింది. వీటిలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 86,237 దరఖాస్తులు వచ్చాయి. హనుమకొండ జిల్లా నుంచి 57,477 దరఖాస్తులు, వరంగల్ జిల్లా నుంచి 57,008 దరఖాస్తులు, ములుగు జిల్లా నుంచి 42,6 57, భూపాలపల్లి జిల్లా నుంచి 40,711, జనగామ జిల్లా నుంచి 34,248 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లబ్ధిదారులను గుర్తించనున్నారు.

ఆ మూడింటికే దరఖాస్తుల వెల్లువ

ప్రభుత్వం కొత్తగా నాలుగు పథకాలను అమలు చేస్తుండగా, రైతు భరోసా మినహా మిగతా మూడు పథకాల కోసం ప్రజలు అధికసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా రేషన్‌కార్డుల కోసం 1,49,478మంది దరఖాస్తులు చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవటంతో చాలమంది కార్డుల కోసం తహసీల్దార్ కార్యాలయాలు, పౌరసరఫరాల శాఖ అధికారుల చుట్టు చక్కర్లు కొట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానించటంతో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చిపడుతున్నాయి. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పరిస్థితి ఇంతే. 2015-18 వరకు రెండు విడతల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసింది. వాటిలో పదివేల ఇళ్లు కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో సొంతింటి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 87,528 మంది దరఖాస్తులు చేసుకున్నారు. సొంత జాగా ఉన్నవారికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుండటంతో లబ్ధిదారుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఒక్క మహబూబాబాద్ జిల్లా నుంచే ఇందిరమ్మ ఇళ్ల కోసం 30,611 దరఖాస్తులు రాగా, వరంగల్ జిల్లా నుంచి 20,578 మంది దరఖాస్తు చేసుకున్నారు. భూమిలేని నిరుపేదలకు ఏటా రూ.12వేల సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 50,276మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 20రోజుల పని దినాలు ఉండాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 7,39,614 జాబ్‌కార్డులు ఉండగా, 15,25,252మంది కూలీలు ఉన్నారు. అయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయం కోసం కేవలం 50,276 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నేడు మండలానికో గ్రామంలో అమలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గణతంత్ర దినోత్సవం నుంచి కొత్తగా నాలుగు పథకాలను ప్రారంభించేందుకు సన్నద్ధమైంది. ఈ మేరకు ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు రోజులు పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించింది. 3,18,338మంది దరఖాస్తులు చేసుకోవటంతో వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. తొలుత ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 76మండలాల నుంచి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు పథకాలను అమలు చేయాలని నిర్ణయించారు. 26వ తేదీన మధ్యాహ్నం 1గంటకు ఎంపిక చేసిన గ్రామాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పర్యటించి లబ్ధిదారులకు కొత్త పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు. ఈ గ్రామాల్లో అర్హులైన వారికి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలను అందించనున్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మిగతా లబ్ధిదారుల దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించనున్నారు. మార్చి చివరి నాటికి అర్హులైనవారికి ప్రభుత్వం కొత్త పథకాలను అమలు చేయాలని నిర్ణయించింది.

రైతుభరోసాకు కోతలే..

అర్హులైన వారికే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాళ్లు, రప్పలు, సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించి రైతుభరోసాను నిలిపి వేయనుంది. గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరానికి ఏటా రెండు పంటలకు రూ.10వేల పెట్టుబడి సాయాన్ని అందించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రైతుభరోసాగా మార్చి ఏటా రెండు పంటలకు ఎకరాకు రూ.15వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. గతేడాది వానకాలం, యాసంగి పంటలకు ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని అందించలేదు. దీంతో ఈ పథకం ఉంటుందా..? ఉండదా? అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. ఈ క్రమంలో కొత్తగా అమలు చేయనున్న నాలుగు పథకాల్లో రైతు భరోసా కూడా ఉండటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఏటా ఎకరానికి ఇస్తామన్న రూ.15వేలకు బదులు రూ.12వేలే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమైంది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 8,89,787మంది రైతులకు గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద రూ.903.93కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు యోగ్యమయ్యే భూములకే రైతుభరోసా ఇస్తామని ప్రకటించింది. ఈ మేరకు సాగుయోగ్యమైన భూములను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి వివరాలు సేకరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సాగుకు యోగ్యంకాని 27,466 ఎకరాల భూములను అధికారులు గుర్తించారు. వీరికి మినహా మిగతా రైతులకు రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే కొత్తగా రైతు భరోసా కోసం 3,506మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత రైతుభరోసాను అమలు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో నాలుగు పథకాల కోసం గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులిలా..

జిల్లా	రేషన్ కార్డులు	ఇందిరమ్మ ఇళ్లు	రైతు భరోసా	ఆత్మీయ భరోసా	మొత్తం
వరంగల్	28,868	20,578	580	6,982	57,008
హనుమకొండ	32,987	19,585	388	4,517	57,477
జనగామ	14,532	13,955	491	5,270	34,248
మహబూబాబాద్	37,954	30,611	561	17,111	86,237
భూపాలపల్లి	20,186	12,661	520	7,344	40,711
ములుగు	14,951	17,688	966	9,052	42,657
మొత్తం	1,49,478	87,528	3,506	50,276	3,18,338

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

ములుగు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అధికారులు భారీ టెంట్లు వేయించారు. వేదికను నిర్మించారు. జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా అలంకరించారు. అధికారులు, ప్రజలు, విద్యార్థుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్ పర్యవేక్షించారు. పోలీసు సిబ్బంది పరేడ్ రిహార్సల్స్ చేశారు. ఎన్పీడీసీఎల్, ఆర్టీసీ, డీసీఎస్‌వో, హౌసింగ్, వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, మహిళా స్త్రీ శిశు సంక్షేమం, డీఆర్‌డీవో ఆధ్వర్యంలో వివిధ పథకాలను వివరిస్తూ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మంత్రి సీతక్క చేతులమీదుగా స్త్రీశిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ బోర్‌వెల్, డీఆర్‌డీవో ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు, ఐటీడీఏ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లు, స్పోర్ట్స్ కిట్‌లు, ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



గణతంత్ర వేడుకల కోసం సిద్ధమైన తంగేడు స్టేడియం

భూపాలపల్లి జిల్లాలో అవార్డులకు 240 మంది ఎంపిక

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే 76వ గణతంత్ర వేడుకల్లో 240 మంది ఆయన చేతుల మీదుగా అవార్డులు పొందనున్నారు.

అవార్డులు అందుకోనున్న అధికారులు

కుసుమ కుమారి (ఏడీ, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్), పణి భూషణ్ (పే అండ్ అకౌంట్), శ్రీనాథ్ (జిల్లా పౌరసరఫరాల శాఖ), శ్రీనివాస్ (డీపీఆర్వో), రాజేందర్ (డీఈవో), నారాయణరావు(డీపీవో), నరేష్ (డీఆర్డీవో), మల్హార్ నాయక్ (ఎన్పీడీసీఎల్ ఎస్ఈ), కుమారస్వామి (జిల్లా పశుసంవర్ధక శాఖ), చెన్నయ్య (స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ), రాజేశ్వర్ రెడ్డి(సింగరేణి జీఎం).

ఉత్తమ ఉద్యోగులు వీరే..

ములుగు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖలకు చెందిన 237 మంది అధికారులు, సిబ్బందిని ఉత్తములుగా ఎంపిక చేస్తూ కలెక్టర్ టీఎస్.దివాకర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. శాఖల వారీగా ఉత్తమ అధికారులు, సిబ్బంది వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

జిల్లా అధికారులు
ఎం.సంపత్‌రావు, కె.కొమురయ్య, తుల రవి, మోహన్‌లాల్, కె.మల్లేశం, వి.శ్రీనివాస్.

రెవెన్యూ శాఖ
బి.మహేష్‌బాబు, జి.జగదీశ్, పి.లక్ష్మీరాజయ్య, డి.రాహుల్‌చంద్రవర్మ, కె.సురేష్ బాబు, ఇ.శ్రీకాంత్, ఎ.శైలేందర్, జి.శ్రీనివాస్, ఎం. వర్ష, కిరణ్‌కుమార్, పి.గణేష్, కె.నాగరాజు, పి.విష్ణువర్ధన్, సుచిత్ర, జి.నూతన్, ఎం.స్నేహ.జి.భరత్, ఎస్.దేవేందర్, డి.స్వామి, ఆర్.రాజేష్, జె.సుమన్, సీహెచ్.సందీప్, ఎం.స్వామి, ఎమ్డీ.పాషా బిన్ అలీ, పి.రాజు, జి.అరవిందాచారి, ఎం.దేవేందర్, టి.శ్రీనివాస్.

పోలీస్ శాఖ
జె.సంతోష్‌కుమార్, ఎస్.అశోక్, అక్బర్ బాషా, బి.రాజన్న, కె.దయాసాగర్, జి.ప్రభాకర్, పి.సూర్యనారాయణ, ఓ.సంతోష్ ప్రసాద్, బి.మధుకర్, కె.రజనికర్, జి.రాజీవ్, వి.అజయ్, జి.రమేష్, ఎం.అనిల్, కె.నాగార్జున, బి.నారాయణమూర్తి, ఎస్.మల్లికార్జున్, ఎస్.సమత, డి.మధు, ఎస్.అజయ్ యాదవ్, ఎ.కిషన్, పి.రాజేంద్ర ప్రసాద్, జి.రాంబాబు, టి.విజయ్‌కుమార్, పి.మధుచందర్, ఇ.విజయ్, ఎన్.శ్యామ్, కె.రాంచందర్, కె.సురేష్.

5వ బెటాలియన్
జి.కార్తీక్, పి.శ్రీనివాసులు, ఎస్.రఘు, బి.భద్రయ్య, ఎస్.స్వామి, ఇ.అశోక్, జి.యమున, కె.మధుసూదన్.

వ్యవసాయ శాఖ
ఎన్.చేరాలు, ఎం.హరిశ్, సయ్యద్ రసూల్ షరీఫ్.

బీసీ వెల్ఫేర్ శాఖ
ఎ.రేణుక, బి.కుమారస్వామి.

సివిల్ సప్లయ్ శాఖ
కె.రాంచందర్

సివిల్ సప్లయ్
ఎ.రాహుల్, ఎ.అశోక్, ఐ.సంతోష్ కుమార్, కె.కర్ణాకర్.

కోఆపరేటివ్ శాఖ
పోరిక పార్వతి, కె.వెంకన్న, వేముల వాడ నాగేశ్వర్‌రావు.

విద్యా శాఖ
ఎన్. వీరేందర్, బి.శ్రీనివాసు, ఎం.సమ్మయ్య.

కళాశాల విద్య
బి.బాలయ్య, ఎస్.కవిత, బి.రేణుక.

టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్
ఎ.ఉమ

డెయిరీ డెవలప్‌మెంట్
డి. తిరుపతి, టి.సుమన్

ఎంప్లాయిమెంట్ ట్రెయినింగ్
ఎం.నాగేశ్వర్‌రావు

అగ్నిమాపక శాఖ
టి.నగేష్, ఇర్.షర్గవ్.

అటవీ శాఖ
మహమ్మద్ యాకూబ్ జాని, ఎం.శివకృష్ణ, ఎ.శ్యామ్‌సుందర్, టి.వినోద్ కుమార్, ఎస్.శరత్‌చంద్ర.

హార్టికల్చర్, సెరీకల్చర్
జె.శ్రీకాంత్, ఎస్.నరేందర్, కె.శ్రీకాంత్.

ఇరిగేషన్ శాఖ
టి.సంతోష్, టి.ప్రదీప్, ఆర్.సునీత, జి.నాగార్జున, ఆర్.రవికుమార్, వలీం మహమ్మద్, కె.ప్రశాంత్, బి.శ్రీధర్‌రావు.

మార్కెటింగ్ శాఖ
ఆర్. శ్రీదేవి

మెడికల్ అండ్ హెల్త్
సి.హెచ్.శ్రీకాంత్, రాహీల్‌పుంజాని, మనోజ్, ఎన్.సంపత్, సీహెచ్.వినోధర్, ఇ.కిరణ్‌కుమార్, కె.రాజేశ్వరి, విజయ కుమారి, పి.శోభారాణి, సీహెచ్.పవతి, నాగమణి, శ్రీదేవి.

మైనారిటీ వెల్ఫేర్ శాఖ
డి.రజిత, సయ్యద్ జుబేర్.

మిషన్ భగీరథ
సి.సతీష్‌కుమార్, ఇ.సునీత, జె.ప్రవీణ్.

ఎన్పీడీసీఎల్
టి.వేణుగోపాల్‌రావు, జి.రామ చంద్రయ్య, ఎ.రాజేందర్.

పంచాయతీ రాజ్ శాఖ
జె.శ్రీధర్‌రావు, పి.శరత్, ఎమ్డీ.సాజిదా, టి.ఈశ్వర్, కె.కిరణ్‌కుమార్, కె.దీప్తి, పి.రాజు, పి.రఘు, టి.దుర్గాప్రసాద్, బి.రమాదేవి, ఎం.ఉపేంద్ర, కె.సతీష్ కుమార్, జి.ప్రవీణ్‌కుమార్, ఎం.సరిత, పి.అశోక్, ఎస్.ప్రభాకర్, పి.దశరత్, ఎం.చరణ్ తేజ్, ఎం.రజిత, పి.గణేష్, ఓ.రఘు.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్
సీహెచ్.రాజు, వి.ధర్మేందర్‌రావు, డి.రాజేష్.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్
ఎల్.కనకరాజు, ఇ.సందీప్, బి.సునీల్.

ఆర్‌అండ్‌బీ శాఖ
కె.జీవన్‌కుమార్, బి.రాజునాయక్, యు.శ్రీనివాస్.

రూరల్ డెవలప్‌మెంట్
సి.హెచ్.వేణుగోపాల్‌రెడ్డి, ఎ.సతీష్, డి.నాగేశ్వర్‌రావు, కె.సుజాత, ఎస్.సత్యనారాయణరెడ్డి, వి.సమ్మక్క, ఎస్.లక్ష్మి, నారగోని సునీత, జి.వేణుగోపాల్, జాటోత్ సురేష్, జి.సత్యేంద్రకుమార్, ఇ.వెంకటేశ్వర్‌రావు, డి.అరుణాకర్, బి.సురేష్, పి.రామాచారి, కె.రాంబాబు, ఎస్కే.షర్ఫున్నీసా

ఎస్సీ కార్పొరేషన్
బి.శ్రీను, ఎ.రాజేందర్, ఎ.గీతాబాయి.

ఎస్సీ అభివృద్ధి శాఖ
జె.శ్రీనివాస్, జన్ను కమలాకర్, అర్షం నవీన్‌కుమార్.

పర్యాటక శాఖ
కె.సూర్యకిరణ్, బి.విజయ్‌కుమార్.

ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్
కె.ప్రభాకర్, డి.వేణుకుమార్.

ట్రైబల్ వెల్ఫేర్
ఎం. రాజ్‌కుమార్, డాక్టర్ క్రాంతి కుమార్, కె.నర్సింగరావు, సి.హెచ్.ప్రశాంత్‌రెడ్డి, ఎ.సురేష్, కె.క్షేత్రయ్య, కె.ఆదినారాయణ, కె.జాన్సన్, బి.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, సీహెచ్.రాజేందర్.

ట్రెజరీ డిపార్టుమెంట్
ఎ.వినోద

వెటర్నరీ డిపార్టుమెంట్
బి.నవత, సీహెచ్.రజిత, టి.ప్రవీణ్.

ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్
డి.చంద్రకళ, ఆర్.శారద, జి.రమాదేవి, ఎమ్డీ.ఇమ్రాన్, బి.విజేందర్, ఎం.సుభద్ర, కె.జమునారాణి, సీహెచ్.దీపిక, కాచులపు సరస్వతి, జి.మౌనిక, వి.సరోజన, జి.స్వరూప, సోడి రజని, ఎన్.హరికృష్ణ, వి.సుదర్శన్, బి.రాణి, కె.కిరణ్.

యూత్ అండ్ స్పోర్ట్స్
జి.మల్లయ్య, బి.వేణు, వై.ఆదినారాయణ, పి.కుమారస్వామి.

జిల్లా ప్రజాపరిషత్
జి. జవహర్‌రెడ్డి, ఎం.రాజు, జి.రాజేంద్రప్రసాద్, ఎన్.జయ, కె.సింధూజ, పి.రవి.

ప్లానింగ్ డిపార్టుమెంట్
పి.నాగరాజు, వి.కిషోర్‌కుమార్, పి.ప్రసాద్.

బ్యాంకర్స్
కేబీఆర్ఎల్ కుమార్, డి.రాజ్‌కుమార్.

నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిష్పక్షపాతంగా ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ .దివాకర అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటును మించి ఏమీలేదు- నేను కచ్చితంగా ఓటువేస్తాను అనే థీమ్‌తో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అధికారులతో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు ఓటింగ్ ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలియజేయడం కోసం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, సివిల్ సప్లయ్ అధికారి రాంపతి, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడిగా రమేష్ రెడ్డి




ములుగు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి ములుగు మండల అధ్యక్షునిగా సానికొమ్ము రమేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దేవగిరిపట్నం గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి ఏడేళ్లుగా బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తగా కొనసాగుతున్నారు. ఆయన భార్య రాజ్యలక్ష్మి పార్టీ నుంచి ఎంపీటీసీగా గెలుపొందారు. అదేవిధంగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆకుతోట చంద్రమౌళి, నూతనంగా ఏర్పడ్డ మల్లంపల్లి మండల ఎన్నికల సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా పాలెపు శ్రీనివాస్‌ను నియమించారు.

మేకల మందలో కొండగొర్రె పిల్లలు

మంగపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అడవికి మేతకు వెళ్లిన మేకలు, గొర్రెల మందలో రెండు కొండ గొర్రె పిల్లలు కలిసాయి. గొర్రెలపాటే వాటి కాపరి ఇంటికి చేరాయి. ఈ ఘటన మంగపేట మండలంలోని కోమటిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరి సమ్మయ్య శుక్రవారం ఉదయం అడవికి మేత కోసం మేకలను, గొర్రెలను తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన క్రమంలో మేకల మందలో కలిసి కొండ గొర్రె పిల్లలు ఇంటికి రావడంతో గుట్టు చప్పుడు కాకుండా ఉంచుకున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్థులు అటవీశాఖలకు సమాచారం అందించారు. దీంతో శనివారం ఉదయం అటవీశాఖ అధికారులు మేకల కాపరి ఇంటికి వెళ్లి మేకల మందలో ఉన్న రెండు కొండ గొర్రె పిల్లలను స్వాధీనం చేసుకొని హనుమకొండలోని హంటర్ రోడ్డు కాకతీయ జువాలజికల్ పార్క్‌కు తరలించారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ జడ్పీటీసీ

వాజేడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు జన్మదినోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ ఆధ్వర్యంలో జరగ్గా మాజీ జడ్పీటీసీ తల్లడి పుష్పలత కేక్ కట్ చేశారు. వాజేడు అభివృద్ధికి ఎమ్మెల్యే వెంకట్రావు ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశ్వనాథప్రసాదబాబు రాజు, దాట్ల సీతారామరాజు, కాకర్లపూడి కల్యాణ్, చెన్నం ఎల్లయ్య, తల్లడి ఆదినారాయణ, రాంబాబు, నానబాబు, నరసింహరావు, ఖాజావలీ, లేగల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

7, 8, 9 తేదీల్లో మహా కుంభాభిషేకం

మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు

మహదేవపూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : త్రివేణి సంగమం వద్ద వెలిసిన ప్రముఖ శైవక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో (శుక్ర,శని,ఆదివారాలు) మహా కుంభాభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. శృంగేరి పీఠాధిపతి ఇచ్చిన తేదీల ప్రకారం కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు. 1982లో జీర్ణోద్ధరణ అయినప్పుడు అప్పుడు కూడా శుక్ర, శని, ఆదివారాల్లోనే 43 సంవత్సరాల క్రితం ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. 2025లో ఫిబ్రవరిలో శుక్ర, శని, ఆదివారాల్లోనే మళ్లీ మహా కుంభాభిషేకం జరిగింది. ఇలా జరిపించడం ఆనవాయితీ అని అర్చకులు, వేద పండితులు అంటున్నారు. అయితే మూడు రోజులు జరిగే మహా కుంభాభిషేకానికి దాదాపు 50 వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తారని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికోసం మంత్రులు, దేవాదాయ శాఖ అధికారులు, కలెక్టర్ సమావేశాలు నిర్వహించి అన్ని విభాగాల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులు తెలపడంతో పనులు వేగవంతంగా నడుస్తున్నాయి. ఈ మహా ఉత్సవాలకు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ నుంచి వేల సంఖ్యలో భక్తులు కుంభాభిషేకంలో పాల్గొనేందుకు వస్తారని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. మే 15 నుంచి 12 రోజుల వరకు సరస్వతి పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి పనులు చేసేందుకు సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ 25 కోట్లు మంజూరు చేసింది. అయితే మూడు నాలుగు రోజుల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కానుంది.

పోలీస్‌స్టేషన్లకు మరింత భద్రత పెంచాలి : ఎస్పీ

వాజేడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం సర్కిల్‌లోని పోలీస్‌స్టేషన్లకు మరింత భద్రత పెంచాలని ఎస్సైలకు ఎస్పీ శబరీశ్ సూచించారు. సర్కిల్‌లోని వాజేడు, పేరూరు, వెంకటాపురం పోలీస్‌స్టేషన్లతో పాటు ఆలుబాక ఔట్ పోస్టులలో భద్రతా ప్రమాణాలపై ఆయన శనివారం సమీక్షించారు. సందర్శన సంద ర్భంగా ప్రస్తుత భద్రతా వ్యవస్థలను పరిశీలిం చారు. స్టేషన్‌లకు తగినంత భద్రతా పెంచే విషయంపై ఎస్సైలు చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీలో భాగంగా స్టేషన్ పరిసరాలను, క్రైం రేటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించాలన్నారు. ఆయన వెంట ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ బండారి కుమార్, వాజేడు, పేరూరు, వెంకటాపురం ఎస్సైలు రాజ్‌కుమార్, కృష్ణప్రసాద్, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.



పేరూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

మహిళా మావోయిస్టు లొంగుబాటు



లొంగిపోయిన మహిళా మావోయిస్టుతో ఓఎస్డీ, పోలీసులు

ములుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ మణుగూరు ఏరియా కమిటీ సభ్యురాలు మడవి మంగ్లీ అలియాస్ నవ్య శనివారం ములుగు ఓఎస్డీ గీతే మహేష్ బాబాసాహెబ్ ఎదుట లొంగిపోయారు. లొంగుబాటుకు సంబంధించిన వివరాలను ఓఎస్డీ మీడియాకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు పీఎస్ పరిధిలోని మల్లంపేట గ్రామానికి చెందిన మంగ్లీ 2018 సంవత్సరంలో మావోయిస్టు పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ప్రోత్సాహంతో మణుగూరు ఎల్‌జీఎస్ ఇన్‌చార్జి లచ్చన్నదళంలో 2019 చేరారు. పార్టీ అనుమతితో 2023లో చర్ల దళ కమాండర్ ఏర్రల్‌ను వివాహం చేసుకున్నారు. అదే ఏడాది మేలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏర్రల్ మరణించారు. మంగ్లీ దళసభ్యురాలిగా ఉన్న మణుగూరు ఎల్‌జీఎస్ ఇన్‌చార్జి లచ్చన్న, అతని బృందం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం అటవీ ప్రాంతంలో గత ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఆ సమయంలో మంగ్లీ ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నారు. 2018లో పూసుగుప్పకు చెందిన ఇద్దరిని, ఊట్లపల్లికి చెందిన మరో ఇద్దరిని ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేసిన ఘటనలో మంగ్లీ నిందితురాలు. 2021 ఏప్రిల్‌లో బీజాపూర్ జిల్లా టేకులగుర్మా వద్ద 24 మంది సీఆర్పీఎఫ్, డీఆర్‌జీ పోలీసులు మరణించిన ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 'టాస్క్' గొప్పవరం

(5వ పేజీ తరువాయి)

జాబ్‌మేళాలో 1200మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రతి ఒక్కరూ రోడ్డుభద్రత నియమాలను పాటించాలని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మూడు కిలోమీటర్ల పరుగుపందెం పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎస్పీ శబరీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. తప్పులు చేస్తూ ఎదుటివారి ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని అన్నారు. నేడు అధికసంఖ్యలో రోడ్డు ప్రమాదాలు తప్పుదారులలో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 20 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు మాత్రమే తల్లిదండ్రులు వాహనాలు ఇప్పించాలని అన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమావళిని పూర్తిగా అవగాహన చేసుకున్న అనంతరమే వాహనాలు నడపాలని, ఎట్టి పరిస్థితుల్లో మద్యంసేవించి వాహనాలు నడపొద్దని అన్నారు.

ఈ కార్యక్రమాల్లో టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా, కో టాస్క్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి, రీజినల్ సెంటర్ హెడ్ ఇ.నవీన్‌రెడ్డి, క్లస్టర్ మేనేజర్ ఎం.సుధీర్, రిలేషన్‌షిప్ మేనేజర్ ఎం.రామకృష్ణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, సెంటర్ మేనేజర్ కె.మురళీకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

రేగొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బొద్దుల సదయ్య(58) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఎంతకీ కుదట పడకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లోని దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రాజేంద్ర, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి కుమార్తె పసిగంటి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

పోచంపల్లిలో దొంగల బీభత్సం

రేగొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఒకే రోజు రెండు చోట్లా పట్టపగలు దొంగతనాలు జరిగాయి. శనివారం మధ్యాహ్నం సమయంలో మడికంటి సాంబలక్ష్మి ఇంట్లో 30 తులాల వెండి, 20వేల రూపాయలు, ఒక బంగారు గొలుసు, పోరెడ్డి దేవేందర్‌రెడ్డి ఇంట్లో రూ. 50 వేలు అపహరించారు. తాళం వేసిన ఇళ్లల్లో ఈ దొంగతనాలు జరిగాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చిట్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలపురం శివారులో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు, సీసీఎస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి నిర్వహించారు. . సంఘటన స్థలంలో రూ.97,350 స్వాధీనం చేసుకున్నారు. చిట్యాల మండ లంతో పాటు హనుమకొండ జిల్లాకు చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మల్హర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో ప్రధాన రహదారి నుంచి పీఏసీఎస్ కార్యాలయం వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య శనివారం ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ. 11.30 లక్షలు మంజూరు కాగా సీసీ రోడ్డు, ఆర్చ్ నిర్మాణం పనులను ప్రారంభించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తిరుపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో తనిఖీలు

ఏటూరునాగారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం, ఓడగూడెం, బొడ్రాయి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎస్సై తాజు ద్దీన్ నేతృత్వంలో శనివారం పోలీసులు తనిఖీలు చేశా రు. గుడుంబా అమ్మకాలు, పేకాట స్థావరాలపై దృష్టి పెట్టిన పోలీసులు పలువురి ఇళ్లను సోదాలు చేశారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

భూపాలపల్లిటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటరు దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ప్రిన్సిపాల్ ఎ.రమణరావు, వైస్ ప్రిన్సిపల్ రుక్సానా, అధ్యాపకులు రామచంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ నాగరాజు, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, శంకర్‌నాయక్, ఎంపీవో వీరస్వామి, ఏపీవో వెంకన్న తదితరులు పాల్గొన్నారు.. దేవరాంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో బీఎల్‌వో అన్నపూర్ణ ఉపాధ్యాయులు ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.
- వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఆర్ఐ మల్లయ్య, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు రాధిక, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కేంద్రానికి చెందిన పంచాయతీ కారోబార్ మెట్టు బిక్షపతి ఉత్తమ బీఎల్‌వో అవార్డును కలెక్టర్ టీఎస్.దివాకర చేతుల మీదుగా కలెక్టరేట్‌లో అందుకున్నారు.
- తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి మానవహారం నిర్మించారు. డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా జరిగింది. తహసీల్దార్ సునీత ఎంపీడీవో హుస్సేన్, ఎంఈవో కుమారస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ రఫి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌పాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- వాజేడు (ఆంధ్రజ్యోతి): ఓటరు దినోత్సవం సందర్భంగా బూత్ లెవల్ అధికారులు కావిరి బాలచంద్రమూర్తి, దేవకుమారికి తహసీల్దార్ శ్రీనివాస్ ప్రశాంసాపత్రాలను అందజేశారు. ఆర్ఐ కుమారస్వామి, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.
- మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఓటర్ల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, వైస్ చైర్మన్ ప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, డైరెక్టర్లు రమేష్, తిరుపతిరావు, ఉపాధ్యాయులు, రెవెన్యూ పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమ్మేత లక్ష్మీనరసింహ స్వామిని శనివారం వివి ధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సందర్శిం చారు. అర్చకులు వారికి దైవదర్శనాలు చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించి స్వామివారి చరిత్రను తెలిపారు. భక్తులు 13 వేల మందికి పైగా తరలివచ్చి మొ క్కులు చెల్లించుకున్నారని దేవస్థానం ఈవో సత్యనారాయణ తెలిపారు.

రామప్పలో హెరిటేజ్ వాక్

వెంకటాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రామప్ప దేవాలయం ఆవరణలో శనివారం సేవా టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, టార్చ్ సంస్థ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ జరిగింది. స్థానిక ప్రజలు, దేవాలయానికి వచ్చిన టూరిస్టులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది, పర్యాటక అభివృద్ధి సంస్థ, సేవా టూరిజం వలంటీర్లు, టార్చ్ సంస్థ వలంటీర్లు పాల్గొన్నారు. కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్, కేంద్ర పురావస్తుశాఖ ఇన్‌చార్జి కుమారస్వామి హాజరయ్యారు.